రక్షమైథిలి

"ఇవ్వాళ కొద్దిగా ఆలస్యం అయింది. అటెండెన్స్ రిజిస్టర్ హెడ్ మాష్టరుగారి రూంకు వెళ్లిపోయిందా?!"

తలెత్తి చూశాడు విరించి. విరబోసుకున్న పెద్ద జుట్టు. తలంటి జడ, కళ్ళు ఎర్రబడి బాగా వాచాయి. ఏడిచి వుంటుంది. ఏమాత్రం శోభస్కరంగా కనిపించని ఆవిడ మైథిలి, సోషల్ టీచరు.

మాట్లాడలేదు అతను. ఆమె వంకే పరీక్షగా చూశాడు. చేతుల మీద ఉబ్బెత్తున వాతలు. ఆ ఇల్లాలు భర్త చేతుల్లో అనుభవించే నరకం ఆ చుట్టు పక్కల వాటా వాళ్లకూ, ఆమె పని చేసే స్కూల్లోనూ అందరికీ తెలుసు.

"శుభ్రంగా ఆ మొగుణ్ణి వదిలిపారెయ్యరాదూ!" యాభై ఏళ్ళ బ్రహ్మచారి అయిన ఏ మాథమాటిక్స్ టీచరో ఉచిత సలహా ఇచ్చినా, "ఆలోచించు మైథిలీ! నీ ఇద్దరు పిల్లల్ని నువ్వు పోషించుకోలేవూ? మేమంతా లేమూ!? ఎప్పుడు ఈ మొగజాతికి బుద్ధి చెప్పగలమే?" అంటూ సన్నిహితురాలు సరోజా టీచరు క్లాసు తీసుకుంటున్నా మైథిలి మాట్లాడదు; అట్లాంటి ఊపు ఆమెకీ వస్తుంది. కానీ అది క్షణికం. ఎన్ని వందల సార్లో నారాయణరావు లేకుండా బ్రతకడాన్ని ఊహించుకుందామని ప్రయత్నించింది.

కానీ ఏదో భయం..

ఎక్కడో అగాథంలోకి దభీమని జారిపోయిన భ్రాంతి. ఎన్నిసార్లు తనకు తాను ధైర్యం చెప్పుకుని, హిప్నటైజ్ చేసుకుందామనుకున్నా జరగలేదా పని. దానికి కారణం మరి ఆమె సబ్‌కాన్షియస్‌లో ఆ పరిస్థితికి ఏదో తెలియని వ్యతిరేకత వుండి వుండాలి.

అసలు ఏ మనిషి అయినా, మంచో, చెడో విని ఆచరణ యోగ్యం చెయ్యాలంటే, దానిపట్ల మనిషికి ఏ ఒక్క అణువంతైనా ఇష్టమో నమ్మకమో వుండి తీరాలి. అటువంటి రూపు కట్టలేని భావనలు రూపం పోసుకుని బలం పుంజుకునే శక్తి ఆ వాతావరణం కలిగించడం లేదు మరి.

"రిజిస్టర్ ఎక్కడ వుందండీ అంటే మాట్లాడరేమిటండీ?" ఆ గొంతులో చికాకు, నిస్పృహ.

మౌనంగా చూపించాడు రిజిస్టర్... ఆమె వంకే చూస్తున్నాడు విరించి. అందరిలాగా అతను ఆమె పట్ల సానుభూతి మాటల్లో చెప్పి గాలిలో కలిపెయ్యడు. సాధారణంగా లేటుగా వచ్చే మైథిలి సంతకం పెట్టేదాకా మరీ కాలాతీతం అయితే

తప్ప ఆ రిజిస్టరు అతను పంపడు. హెడ్ మాష్టరు దగ్గర నుంచి ప్యూన్ దాకా ఆమె పరిస్థితి పట్ల సానుభూతి వున్నవారే.

గాజులు లేని చెయ్యి సంతకం పెడుతోంది.

ముంజేతుల మీద అక్కడ, అక్కడక్కడ రక్తం... బహుశ స్కూలుకు బయలుదేరేముందు ఏదో భయంకరమైన తగువు అయి వుంటుంది. గాజులన్నీ విరిగిపోయి గుచ్చుకున్నాయి. ఆమె వంకే చూస్తూ ఆలోచిస్తున్నాడు విరించి.

ఇరవయ్యవ శతాబ్దం ఉత్తరార్థంలో ఒక విచిత్రమైన ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థ ఏర్పడుతున్నాయి. పెళ్ళిళ్ళకు కట్నాలు, లాంఛనాలు డిటో. కాని పెళ్ళి ఇచ్చే సెక్యూరిటీ, దానిమీద నమ్మకం మాత్రం పలచబడిపోతున్నాయి.

ఏ చిన్న కారణం వల్లో, అమర్యాద వల్లో ఉద్యోగం మానేసే పురుష పుంగవులు "ఎలా అయినా బతకలేకపోలేం"- అన్న "పనికిమాలిన ధీమా" వుండే పురుష సింహాలు పెరిగిపోయారు. కానీ, వీరిలో చాలామంది ఏది తక్కువైనా బతకలేరు. అవన్నీ తమ గొప్పతనం గుర్తించి ఎవరైనా అమర్చిపెట్టాలని ఆలోచిస్తారు. వీళ్లకు "కన్నెచెర" కు బందీలయిన ఆడపిల్లలు పెళ్లిపేరుతో బలైపోవడానికి, భంగపడడానికి సిద్ధపడతారు. ఒక్కొక్క మొగవాడి దశ బాగుండడం వల్ల అక్షర జ్ఞానంవున్న భార్యలు, అందగత్తెలు, సంస్కారవంతులైన భార్యలు కూడా దొరుకుతారు. ఆ అమ్మాయిలలో చాలామంది ప్రపంచ జ్ఞానంతో బోలెడంత పుస్తక జ్ఞానంతో పెరుగుతారు. చాలా తొందరగా ఎదిగిపోతారు. అందుకే తలకాయ వంచుకుని పస్తులతో పడుకోలేరు. ముఖ్యంగా బిడ్డలుంటే వారిని బాధపడనివ్వలేరు. ఏదైనా సరే, తన ఆత్మగౌరవానికి భంగం రాని పనిచేసి, తన కుటుంబాన్ని పోషించుకోవాలన్న ఆత్మస్థైర్యంతో పోరాటం జరపడానికి సిద్ధపడతారు.

ఇటువంటి స్థితిలో సంఘం ఏ మాత్రం తెలివిగా వున్నా, ఈ స్థితిలో అటువంటి స్త్రీ మూర్తులకు ఏం సహాయం చెయ్యాలా? అని ఆలోచిస్తే, చాలా ఆర్థిక, సామాజిక సమస్యలు తగ్గిపోతాయి. కానీ, దురదృష్టవశాత్తు, బంగారుగాజుల జతలు, పట్టు చీరల రెపరెపలు, భర్త తాలూకు ఆస్తి, హోదా - ఇవన్నీ స్త్రీ పరిస్థితికి గౌరవం ఆపాదించే ఈ వ్యవస్థలో ఇటువంటి స్త్రీ మూర్తులు తలకాయ ఎత్తి ఆలోచించలేక పోతున్నారు. ఒక పిడికెడు సానుభూతి, గుప్పెడు ఓదార్పు వీళ్లను నిలబెట్టి బతికించగలదేమో!...

అటువంటి స్త్రీల కోవకు చెందిన అమ్మాయి మైథిలి. మంచి ఉద్యోగం దురభిమానంతో పోగొట్టుకున్న నారాయణరావు. కాంప్లెక్సును. బాధను మర్చిపోవడానికి తాగుడుకు అలవాటు పడ్డాడు. భర్త పౌరుషానికి, ఆవేశానికీ, కోపానికీ, రోషానికీ ఏకైక బలిపశువు ఆమె. పెళ్లిలో వీడియోలలోను, ఫోటోల్లోనూ దిగిన ఏ బంధువు కానీ, అప్పగింతల బట్టలు పెట్టించుకున్న ఏ ఆత్మీయుడు. కానీ ఇప్పటి ఆమె స్థితికి కారణం అడగరు.

అతని పరిస్థితికి కారణం అతని భాషలో ఫ్రస్ట్రేషన్... అది సంఘం అర్థం చేసుకోగలదు.

ఆమె స్థితికి మాత్రం కారణం ఖర్మ... అది అనుభవించక తప్పదు మరి - ఇది సంఘం చేసే శాసనం.

విరించి, మైథిలి ఒకే స్కూల్లో టీచర్లుగా పనిచేస్తున్నారు. అంతేకాదు, దాదాపు మైథిలి అద్దెకు వుండే పోర్షన్ వెనక పక్కగా ఒక చిన్న గదిలో అద్దెకు వుంటున్నాడు విరించి. అందుకే ఆ గోడ వెనకాల జరిగే చాలా గందరగోళాలకు అతను ప్రత్యక్ష సాక్షి.

విరించి మంచి రచయిత అవునో కాదో కానీ గొప్పగా ఆలోచించడం నేర్చుకుంటున్న మనిషి. ఆ చుట్టుపక్కల చాలా సంసారాల్లో అల్లకల్లోలాలు, ఒడిదుడుకులు, వైమనస్యాలు చూస్తూనే వున్నాడు అతను. చాలావరకూ చాలామంది సమస్యలకు అంతర్గతమైనది ఆర్థికసూత్రం. అది చాలా సులభంగా అర్థమైంది అతనికి.

కానీ మైథిలీ, నారాయణరావుల విషయాలు వేరు. వారి సంసారంలో ఏదో ఊబి. అతడిలో తడిలేని కరుకుదనం. ఆమె కన్నీళ్లు మింగి కడుపు నింపుకోవడం, వున్న ఇద్దరు బిడ్డల్లో ఒకరు అవిటి వాడవడం తనను హింసించి తృప్తి పొందక పోయినప్పుడు, ఆ అవిటి బిడ్డను చిత్రహింస పెట్టే భర్త, ఆమె సంపాదించక తప్పనిసరి స్థితి. అతడు అనుమానించి చిత్రహింస పెట్టే పరిస్థితి - ఇవి చాలు మనకు వాళ్ల సంసారమనే న్యూస్ అర్థమవ్వడానికి.

కానీ తమాషా! విరించిలో మగవాడైన ఆలోచనాపరుడికి అసలు మైథిలి అంటే అంతర్గతమైన సన్నని విసుగు, కోపం వుందేమోనని వులిక్కిపడేవాడు.

నారాయణరావు విరించికి బాగా తెలిసిన వ్యక్తి. తాగివచ్చి మైథిలిని చావగొట్టడం లాంటి విషయాలు కళ్లబడటం వలన అతని ప్రవృత్తి గురించిన ఆలోచన వస్తోంది కానీ, కాకపోతే నారాయణరావు చాలా పెద్ద మనిషి కిందే లెక్క సరదాగా కబుర్లు చెపుతాడు. అటువంటివాడి గురించి కేవలం మైథిలిని బాధపెట్టడం అనే ఒకే కారణం వల్ల రాక్షసుడిగా చిత్రీకరించబడేటప్పుడు - చెప్పద్దూ విరించికి కొంత బాధ కలుగుతుంది.

"ఏంటి బాబూ! క్లాసు వుందా? అని మైథిలీ టీచరు రెండుసార్లు అడిగి విసుక్కుని వెళ్లిపోయారు. ఏమిటి ఆలోచిస్తున్నారు?" కాఫీ తెచ్చి పెడుతూ అన్నాడు ప్యూను.

'ఆ! ఆహా!' అంటూ కాఫీ తాగుతూ, మళ్లీ ఆలోచిస్తున్నాడు విరించి.

అసలు నారాయణరావు ఎందుకు అలా తయారైనాడు? అన్న ప్రశ్నకు చటుక్కున "మైథిలే కారణమేమో" అన్న ఎదురొ్క లేని, అర్థం లేని, అమానుషమని తెలిసీ తట్టుకోలేని జవాబు విరించిని వెంటాడుతూనే వుంటుంది. ప్రపంచానికి

అంతా కొంచెం మొండివాడు, ఎక్కువ మంచివాడుగా కనబడే వ్యక్తి కేవలం భార్యా పిల్లల విషయంలో ఇంత క్రూరంగా, భయంకరంగా ఎలా వుండగలడు?!

కళ్లల్లో ప్రాణాలు పెట్టుకుని ఈసురోమని వుండే మైథిలిని చూసి సాటి వ్యక్తిగా జాలి పడుతున్నాడేమో కానీ, మొగవాడిగా ఆలోచిస్తే, నారాయణరావును చూస్తేనే ఒకరకమైన జాలి విరించికి.

"పంపు దగ్గర నుంచి నీళ్లు తెచ్చుకుందామంటే బిందె చిల్లు పడింది" అన్న సమస్య దగ్గర నుంచి "బియ్యం లేకపోతే పిల్లలకు బ్రెడ్ పెట్టాను" అన్న సమస్య వరకూ - ప్రపంచం అంతా మైథిలిని సపోర్టు చేసే పాయింట్లూ, నారాయణరావును చివాట్లు పెట్టే ఏర్పాటు ఏదో జరిగిపోతోంది అన్నది విరించి అభిప్రాయం – కానీ, ఇవన్నీ బయటకు చెప్పక్కర్లేదు అతను.

మైథిలి నారాయణరావులో ఏదో కాంప్లెక్స్ రేపుతోంది. తెలియకుండానే అతని ఇగోను హర్ట్ చేసి, అతనిలో పైశాచికత్వాన్ని ట్యూన్ చేస్తోంది. ఇద్దరు బిడ్డలతో చిన్న వంటిల్లు, ఒక గది ఇంట్లో అద్దెకు వుండే మైథిలి భర్త శారీరకమైన కోర్కెలకు కూడా "పిల్లలున్నారు" అని తోసిరాజంటోంది. ఇదంతా అతని కెమికల్ స్ట్రక్చర్ మీద దెబ్బతీస్తోంది. సాధారణమైన ఆడదానిలా పోట్లాడి, కాపీనం ప్రదర్శించి, "ఈ గిన్నె మాదే" అని పక్కవాళ్లతో తగూ వేసుకుంటూ, గెజిటెడ్ ఆఫీసర్ పెళ్లానికి కూడా దొంగతనం అంటగట్టగలిగానన్న తృప్తితో బతుకుతూ కూరలవాళ్లతో, రిక్షావాళ్లతో పోట్లాడి, బేరాలాడుతూ– ఇలా మామూలు రకం ఆడవాళ్లలా వుండదు మైథిలి.

నెమ్మదిగా, మౌనంగా హింసపడుతూ కూడా "పిచ్చివాడా! నువ్వింతకన్న ఏం చెయ్యగలవు? నీ మీద నాకు జాలి వేస్తోంది" అన్నట్లు చూసి మరింత కసి రేపుతోందేమో మైథిలి. అదే నిజమైతే. నారాయణరావే ఏమిటి! ఏ మొగవాడైనా చెప్పలేని కాంప్లెక్స్‌కు లోనై, దానికి అవుట్‌లెట్ లేక ఇలా హింస ద్వారా తృప్తి పడతాడేమో!

కానీ, కొన్నాళ్లు ఇలా ఆలోచిస్తూ 'ఈ సమస్య నాది కాదు' అన్న పలాయన వాదంతో హాయిగా వుందామని ప్రయత్నం చేసిన విరించికి ఈ మధ్య ఈ సమస్య గురించి, పరిష్కారం గురించి ఆలోచించక తప్పడం లేదు.

కారణం? అతనిలోనూ "మనిషి" వున్నాడు. ఆ మనిషికి సంస్కారం ఎవరి పరిధి వారిది అన్న పొరలు వెయ్యకపోతే చాలా సహజంగా రియాక్ట్ అవుతాడు.

ఈ మధ్య నారాయణరావులో అమానుషత్వం పెరిగిపోతోంది. ఒద్దనుకున్నా అదంతా విరించి కళ్ళపడక తప్పడం లేదు. రేషన్ డబ్బులు దొంగిలించి తాగుతున్నాడు నారాయణరావు. హింసల్లో చిత్ర విచిత్ర హింసలు కనిపెట్టాడు. అవన్నీ చూస్తూ వుంటే, ఒంటరిగా ఉన్నప్పుడు తనకు తెలియకుండానే ఊహల్లో నారాయణరావుతో మాట్లాడుతున్నాడు. ఊహల్లోనే బెల్ట్ పెట్టి తెలీకుండా కొడుతున్నాడు. ఎన్ని నీచమైన ప్రశ్నలు అడిగాడో, ఎంత బోధ చేశాడో అతనికే తెలియదు.

కానీ, ఇదంతా ఊహల్లోనే.

అసలు నా కోపానికి కారణం ఏమిటి? అని తనను తాను ప్రశ్నించుకున్నాడు. చాలా రకమైన ఇబ్బందికరమైన ప్రశ్నలు వేసుకున్నాడు. "నేను బుద్ధిజీవిని" అనుకునే వ్యక్తి కాబట్టి మనసు మేధస్సు పోటీపడి పెట్టే ఈ రకమైన చర్యలన్నీ భరించాడు.

చిన్నప్పటి నుంచీ బాధ్యతా బరువుకు అలవాటు పడ్డ వ్యక్తి విరించి. అందుకే బద్ధకస్తులను, వ్యసనపరులను, కాలాన్నీ, డబ్బును వ్యర్థం చేసేవాడిని "భరించలేనితనం" ఏదో అతని అంతరాంతరాలలో వున్నది. పల్లెలో వుండే ముసలి తల్లి, పెళ్లి కావాలసిన చెల్లి, సంపాదన చాలని అన్నగారి సంసారం, చదువుకుంటున్న తమ్ముడు – వీరందరూ విరించి సంపాదనలో ఎక్కువ భాగానికి కర్తలు. తనవల్ల బతుకుతున్న వీళ్లంటే అతనికి ఏదో ఇష్టం, వాళ్ళ పట్ల నిష్ఠ వుందా అంటే చెప్పలేం కానీ, వాళ్ళు తన కర్తవ్యం అనుకుంటున్నదాన్ని పూర్తి చెయ్యడానికి ఉపాధులుగా కనిపించేవారు. అందుకే అతడిలో మనిషికి – కర్తవ్యం పట్ల చాలా నిష్ఠ కలిగిన అహంకారి అయిన మనిషికి, నారాయణరావు అంటే సహజమైన సానుభూతి, గౌరవం తగ్గిపోతున్నాయి. ద్వేషం, అసహ్యం పెరిగి పోతున్నాయి. ఇవి ఏమాత్రం శ్రేయస్కరమైన విషయాలు కావని ఆలోచనాపరుడైన విరించికి తెలుసు. కారణం ఈ గుణాల తాలూకు పరిణామాలు అతి త్వరలో అసహ్యకరమైన రూపంలో బయటపడతాయని అతనికి తెలిసిన సత్యం

ఉద్యోగరీత్యా, ఇంటిరీత్యా మైథిలి సంసారానికి దూరం కాలేదు. దగ్గరగా వుండి ఈ టెన్షన్ అందరిలా మామూలుగా తీసుకోలేదు.

అందుకే ఆలోచిస్తూ ఒక నిర్ణయానికి వచ్చాడు ఆ రోజు విరించి–

❀ ❀ ❀

సానుభూతి చూపేవాళ్ళను చూస్తే మనిషి చాలా బలహీనతను వెళ్ళబుచ్చుతాడు. దానికి తోడు ఏదో ప్రత్యేకత, ఇగో శాటిస్‌ఫాక్షన్ దొరికితే ఇంక చెప్పక్కర్లేదు. మైథిలి ఈ తత్వానికి పెద్ద వ్యతిరేకి కాదు. స్టాఫ్ మెంబర్లు, ఫ్రెండ్లు వీళ్ళ మధ్య ప్రతిరోజూ తన సంసారం ఈతి బాధలు మాట్లాడేస్తుంది మైథిలి. ఎవరైనా, "ఆ మొగుడు లేకపోతేనేం" అందామనుకున్నప్పుడల్లా, తిడుతూనో, నిందిస్తూనో మాటల సందర్భంగానో అతణ్ణి సమర్థిస్తూ మాట్లాడకుండా వుండలేదు. మైథిలి. "ఆయన మొదట్లో చాలా మంచివారు. ఇప్పుడు ఇలా అయిపోయారు కానీ..." అన్నది ఆమె మామూలు ఊత పదంలాంటి వాక్యం. ఆమె ప్రపంచానికి అతను కేంద్ర బిందువు. ఆవిడ దృష్టిలో ఆ దృష్టే అన్ని కష్టాలకూ, అనుభూతులకూ కారణం అనిపించింది విరించికి.

ఉన్నట్లుండి ఒకరోజు మైథిలి మాటలు హిస్టీరికల్‌గా మారడం విని విని,

"ఎంతసేపూ మీరు ఆ బిందువు చుట్టూ పరిభ్రమిస్తారు. మిగతా ప్రపంచం లేదా ఇక?"

సూటిగా చూస్తూ ప్రశ్నించాడు ఆమెను విరించి. ఠక్కున మంత్ర ముగ్ధలా ఆగిపోయింది మైథిలి. అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయింది. "కోపం వచ్చిందేమో?" అనుకున్నాడు విరించి.

మూడు రోజులు కనబడలేదు. లీవు పెట్టిందట. ఆ మర్నాడు వస్తూనే-

"మీరు చెప్పినదాన్ని గురించి చాలా ఆలోచించాను విరించిగారూ! నా ఈ దుఃఖానికి ఈ నా పరిభ్రమణమే కారణమా? అనినన్ను నేను చాలా సార్లు ప్రశ్నించుకున్నాను. చాలా గొప్ప ప్రశ్న అడిగారు మీరు. అదే ఆలోచిస్తున్నాను. కానీ నాకీ పరిధి నుంచి బయటపడటం ఎలాగో తెలియడం లేదు. నాకే కాదు, నావంటి చాలా మందికి..." ఆలోచిస్తూ మాట్లాడుతూ వెళ్ళిపోయింది క్లాసుకు.

అదిరిపోయాడు విరించి. ఆమెకు మరొక పక్క నుంచి ఆలోచించడం కొంత నేర్పాలనుకున్నాడు నిజమే.

కానీ మరీ ఇంత సీరియస్‌గా తీసుకుంటుంది అనుకోలేదు.

కానీ కొందరు, కొన్ని క్షణాల్లో మాట్లాడే మాటలు మంత్రాక్షరాలు ఒక్కొక్కసారి ఉచ్చరించిన వ్యక్తి కక్ష్యదాటి నిశ్శబ్దతలో వెలుతురు స్వరాలు వినిపిస్తాయి అవి!

మరొక రోజు...

"ఇది మేము తెచ్చిపెట్టుకున్న దాస్యం. ఇది దాటడం మాకే ఇష్టం లేదేమో! ఈ జీవితాన్ని ఇలా కాక మరొక రకంగా ఎలా బతకాలో, ఆలోచించాలో అర్థం కావడం లేదు..." అన్నది పిల్లల క్లాస్ వర్క్ కరెక్ట్ చేసుకుంటూ.

ఆమె వంకే చూస్తున్న విరించికి ఒకటి అర్థమైంది. నిద్రాణమై అరమోడ్పుగా వుండే ఆమె కళ్ళు ప్రస్తుతం విచ్చుకుని ఎర్రబడి వున్నాయి. ఆమెలో ఆలోచన ఏదో చాలా తీవ్రంగా రక్తంతో కలిసి అయస్కాంత శక్తిలా వ్యాపిస్తోంది.

ఆమె తన పరిస్థితికి పరిష్కారం వెతుకుతోందని తెలిసింది అతనికి.

"ఒక పని చెయ్యకూడదూ? అసలు మీరింకేం చెయ్యగలరో ఆలోచించండి."

"అంటే..." పెన్ను మొన కొరుకుతూ అన్నది.

"దెబ్బలు తినడం, ఏడవడం, వంట చేసుకోవడం, పిల్లల్ని ప్రేమగా చూడటం" కొట్టడం, రేపటి రోజు ఎలా అని దిగులు పడటం, అప్పుడప్పుడు సుఖపడుతున్న వాళ్ళని చూసి అసూయపడటం, అందరికీ మన కష్టాలు చెప్పి దీనంగా మొహం పెట్టుకుని కూర్చోవడం, మీ ఆయనను ప్రేమిస్తున్నాను అనుకుంటూ భరించడం - ఇవికాక ఇంకేం చెయ్యగలరు?"

ఫక్కున నవ్వేసింది మైథిలి. "ప్రేమించడమా? నా మొహమా?" అని క్లాసుకు వెళ్ళిపోయింది.

ఆ తరువాత చాలా సీరియస్‌గా వుంటే "ఏమిటి?" అని అడిగాడు విరించి. 'ఆ! ఏముంది? మళ్ళీ వాళ్ళాయన కొట్టి వుంటాడు, అనుకుని.

"ఆలోచిస్తున్నాను..." అన్నది మైథిలి.

ఆమె మాటల్లో శక్తి అతనికి జలదరింపును కలుగజేసింది.

మూడురోజుల తరవాత.....

"విరించిగారూ! మా బాబుకు ఫిజియోథెరపీ చేయిస్తున్నాను. తప్పకుండా కాలు వస్తుందన్నారండీ డాక్టరుగారు. వాళ్ళ పిల్లలకు ట్యూషన్ చెపుతున్నాను. వాళ్ళు చాలా మంచివారు–" అన్నది.

దీనివల్ల జరిగిన మేలేమో కానీ, ఒక రెండు గంటల కాలం ఆవిడ జీవితం మరొక కొత్త ప్రపంచంలోకి తొంగి చూడటం జరిగింది. అదృష్టమేమిటంటే, అక్కడ ఆమెకు ఎదగడానికి కావలసిన వాతావరణం ఏర్పడింది.

మొత్తానికి కష్టాలు లేకపోతే తోచని స్థితి దాటారు. మరి కొంచెం దూరం వెళ్ళి ఆలోచించండి. ఈ విషయాలు తప్ప మీరు ఇంకేం మాట్లాడగలరు?" తీరికగా వున్నప్పుడు మరొక ఆలోచనా బీజం వేస్తూ అడిగాడు విరించి.

చెంపన చెయ్యి పెట్టుకుని చాలా సేపు ఆలోచిస్తూ కూర్చుంది మైథిలి. చివరికి–

"ఏం మాట్లాడకేం? చాలా చాలా మాట్లాడగలను నేను... నేను... ఓహ్... నేను ఎక్కడ ఆగిపోయానో అర్థమవుతోంది..." అంటూ అక్కడనుంచి వెళ్ళిపోయింది.

మనిషిలో కనబడని మార్పులు ఆమెలో వ్యక్తిని ప్రభావితం చేస్తూంటే, కనబడే మార్పు మాత్రం ఆమెలో చురుకుదనం, చీర కట్టుకోవడంలో పొందిక, ఆలోచించి మాటకు సరైన జవాబు చెప్పడం, ఆత్మన్యూనత, పరనింద, మాటల్లో తగ్గిపోవడం, నీరసం, నిస్సత్తువ లేకపోవడం – ఇవన్నీ గమనిస్తున్నాడు విరించి.

ఒకరోజు మాటల సందర్భంలో మైథిలి స్టాఫ్ రూంలో చాలా చక్కటి ఆర్గ్యుమెంట్స్ చెయ్యడం వింటూ నిలుచున్నాడు విరించి.

"అజ్ఞానంలో వున్న మనిషికీ, మేధావంతుడైన మనిషికీ తేడా అతని జీవన విధానంలో కోరికలకూ, అవసరాలకూ ఇచ్చే గౌరవంలోనే బైటపడుతుంది. కాపిటలిజమ్ మార్కెట్ ఎకానమీతో మనిషి కోరికలు తీర్చుకునే వ్యవస్థను సృష్టిస్తుంది. కానీ అవసరాల గురించి ఆలోచించనివ్వదు. టీవీ సెట్ కావాలా, మంచి డ్రైనేజ్ సిస్టమ్ కావాలా? అంటే సామాన్యుడు 'టీ.వీ.' కోరుకుంటాడు. సోషలిజమ్ మనిషి అవసరాలను తీరుస్తుంది. ఆడంబరాలకు పెద్ద పీట వెయ్యదు. అందుకే ఈ రెండూ కలిసిన గవర్నమెంటు ఎక్కువగా మన దేశానికి అవసరం..."

హియర్ హియర్ ...అంటూ చప్పట్లు కొట్టారు ఒకరిద్దరు. అందులో విరించి కూడా వున్నాడు. చటుక్కున తలెత్తి అతని వంక చూసి పసిపాపలా హాయిగా నవ్వేసింది మైథిలి.

"మీరు ఆలోచిస్తున్నారు... చాలా పెద్ద మార్పు వస్తోంది!" తీరుబడిగా వున్నప్పుడు అన్నాడు విరించి.

"అవును... ఆలోచించడం నేర్చుకుంటున్నాను. మీరు నాకు గురువు."

"ఏడిచినట్లుంది.." ఏదో అనబోయాడు విరించి.

"నాకు తెలుసు మీరు ఏమంటారో? నేను నేర్చుకుంటున్న మాటలు మీ మీద విసురుతున్నాను. అంతే... అంటారు. అది మీ వరకు నిజం అయ్యుండవచ్చు. కాని, నా వరకు అవి ప్రాణం పోసిన మంత్రాలు. అయినా ఎందుకో కొంతమంది చెబితే వినాలి అనిపిస్తుంది. ఇప్పుడు నేను ఇంట్లో ఆర్గ్యుమెంట్స్ మానేశాను. ప్రశాంతంగా వున్నది ఇల్లు."

"అంటే ...దెబ్బలూ... అవీ..."

"అవి తప్పవు. కానీ ఆయనను కొట్టే స్థితికి తరమడం మానేశాను అనుకుంటాను."

నవ్వాడు విరించి ఆ కన్ఫెషన్‌కు.

"అయినా మీరు చెప్తే నేనెందుకు వింటున్నాను?" తుపాకీ గుండులాంటి ప్రశ్న అది. కానీ ఆ ప్రశ్నలో దగ్గరతనం లేదు. ఏదో ప్రోబింగ్ వున్నది.

"చెప్పలేను... బహుశ ఇద్దరం ఎక్కడో ఒక ఆలోచనా పరిధి దగ్గర కలుసుకుంటున్నామేమో?" అతనికి తెలియకుండానే ఆమెను గౌరవంగా చూస్తూ అన్నాడు విరించి.

కామ్యం లేని స్నేహం అర్థమవుతోంది ఇద్దరికీ.

"ఏమో?" అంటూ వెళ్ళిపోయింది.

"మాంటిసరీ ట్రైనింగ్‌లో చేరాను. మా ఆయనకు మందు ఇప్పిస్తున్నాను..."

"మీరే ఇస్తున్నారా?" నవ్వుతూ అడిగాడు విరించి. నవ్వేసింది.

"లేదు. ఆయన మందు తగ్గించి టాబ్లెట్స్ వాడే స్థితికి వచ్చేశారు. కానీ విరించిగారూ! నన్ను కొంచెం గైడ్ చెయ్యండి. నేను వ్యర్థజీవి అన్న ఫీలింగ్ ఆయనకు ఎక్కువైపోయింది. అసలు ఈ ఆలోచన ఇప్పుడు కొత్తగా రావడానికి కారణం ఏమిటా అని ఆలోచిస్తున్నాను."

"మైథిలిగారూ! జాగ్రత్త. ఇది చాలా డేంజరస్ ఫీలింగ్. ఇప్పుడే కాంప్లెక్స్ మరింత పెరుగుతుంది. మీరు ఒకపక్క చాలా ఉపయోగకరమైన వ్యక్తిగా మారుతున్నారు. కన్నీరు లేదు. పనికిమాలిన దుఃఖం లేదు. సానుభూతికి వెంపరలాడటం లేదు. అతని దాస్యంలో లేరు. ఈ స్థితిని అతను తట్టుకోవడం కష్టం...."

అతని గొంతులో ఆదుర్దా, అభిమానం– కళ్ళల్లో నీరు తిరిగింది మైథిలికి.

బుద్ధిగా తల ఊపి వెళ్ళిపోయింది. "ఇవన్నీ మీకు ఎలా అర్థమైనాయి?" అన్న ప్రశ్న అడక్కుండా వెళ్ళినందుకు ఒకరకంగా బాధపడ్డాడు విరించి. మరొకరకంగా జవాబు చెప్పమనకుండా రక్షించింది అని సంతోషించాడు.

క్రమేణా మైథిలిలో చాలా మార్పు, ఉత్సాహం పెరిగింది. కల్చరల్స్‌లో తానే లీడింగ్. నారాయణరావు ఏదో చిన్న ఉద్యోగంలో చేరాడట. అతనిలో అప్పుడప్పుడూ పశుత్వం నిద్రలేచినా, ఈ కొత్త మైథిలిని అవి బాధ పెట్టలేకపోతున్నాయి.

విరించికి ఒక విషయం అర్థమైంది.

జీవితావసరాలు మనిషికి ఇచ్చి రక్షించడం కాక, అసలు ఆ మనిషికి తనకు తోడు తానే అయి బతికేట్లు చెయ్యడం మంచి పని అని.

టీ.వి.లో సంస్కృత రామాయణం బ్యాలే చూస్తున్నాడు విరించి.

రాముడు బంగారు లేడి వెతుకులాటలో "రక్షమైథిలీ" అని లక్ష్మణుడికి చెప్పి వెళ్ళిపోయాడు. కానీ, ఆమెను ఆమే రక్షించుకోమని చెప్పివుంటే ఎలా రక్షించుకోవాలో నేర్పివుంటే, రామాయణంలో యుద్ధకాండ అవసరం వుండేది కాదేమో!

ఒకప్పుడు భయంగా బతకడానికి అలవాటుపడ్డ మైథిలి ఇప్పుడు విడిగా తనను తాను పెంచుకుంటూ ఎదుగుతూ బతుకుతోంది.

"నాలో ఆలోచనా జ్ఞానం పెంచారు. నేను విడిగా, నేనుగా ఆలోచించగలుగుతున్నాను" అని ఆమె కృతజ్ఞతతో అన్నప్పుడు విరించి కళ్ళు ఆకస్మికంగా చెమ్మగిల్లుతాయి. మైథిలిని రక్షించే ఈ మొత్తం ప్రోసెస్‌లో తను ఎన్ని మెట్లు ఎక్కాడో, ఎన్ని చీకటి ఆలోచనలకు వెలుతురు మెట్లు కట్టాడో తెలుసుకోగలుగుతున్నాడు.

'రేపు పుట్టబోయే శిశువును గురించి కానీ, నిన్న నశించిపోయిన మనిషిని గురించి కానీ, ఆలోచించకుండా కేవలం వర్తమానం జీవితమనుకుంటే చాలా దౌర్భాగ్యపు చరిత్రలకు పునాదులు పడవు–" అంటూ జీవితాన్ని కాలాతీతంగా చిత్రీకరిస్తూ ఆర్టికల్ రాసింది స్కూల్ తరపున మేగజైన్‌లో మైథిలి.

మంత్రము, మనిషిలో వైబ్రేషన్ కలిస్తే ఒక అపూర్వమైన మాగ్నటిజమ్ ఉద్భవిస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ కలిస్తే మరొక కొత్త రూపుదాల్చి నీరుగా మారుతుంది. విరించి చేసిన ప్రయత్నం, మైథిలి పరిస్థితి కలిసి మరొక కొత్త మైథిలి రూపుదాల్చింది.

మైథిలి తనను తానూ, తద్వారా తన చిన్ని ప్రపంచాన్నీ రక్షించుకోవడం నేర్చుకున్నది.

(ఆంధ్రజ్యోతి – 9-8-1991)